## ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోండి..



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన నియోజకవర్గ ప్రజలు

దుండిగల్, సెప్టెంబర్ 30 : ప్రజలు నుంచి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేలా తగు చర్యలు తీసుకోవాలని ఉమ్మడి రంగా రెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ పార్టీ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు శంభీపూర్‌రాజు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శనివారం శంభీపూర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన సంక్షేమ సంఘాల ప్రతినిధులు, కాలనీవాసులు, పార్టీ శ్రేణులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి.. తమ సమస్యలపై వినతిపత్రాలను అందించారు. వెంటనే ఆయన.. సంబంధిత అధికారులతో ఫోన్‌లైన్లో మాట్లాడి సమస్యలను సత్వరమే పరిష్కరించేలా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## సెక్టార్ అధికారులకు ఎన్నికల నిర్వహణపై అవగాహన

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 30 : వచ్చే సార్వత్రిక ఎన్నికలు నియమ నిబంధనల మేరకు సజావుగా జరిపేందుకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని కుత్బుల్లాపూర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సైదులు సూచించారు. శనివారం జీడిమెట్ల డివిజన్ సరోజినీగార్డెన్‌లో కుత్బుల్లాపూర్‌లోని 41 సెక్టార్‌ల పరిధిలోని ఉన్న ఆయా విభాగాల అధికారులకు, సిబ్బందికి ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఒక్కో సెక్టార్ కింద 17 పోలింగ్‌బూత్‌లను కేటాయించడం జరుగుతుందని, ఆ సెక్టార్‌కు ఉన్నతాధికారి పూర్తివ్యవహారాలను చూసుకోవాలని పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ జోన్ ఏసీపీ గంగారాంతో పాటు ఆరు పీఎస్‌ల సీఐలు, అధికారులు, బీఎల్‌ఓలు, అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

దుండిగల్, సెప్టెంబర్ 30 : నిజాంపేట్ నుండి బాచుపల్లివైపుకు వెళ్లే మార్గంలో బైక్ అదుపుతప్పి కిందపడి.. చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా కొత్తగడి ప్రాంతానికి చెందిన వేణుగోపాల్(40) సూరారంలోని మల్లారెడ్డి నారాయణ ఆసుపత్రిలో బ్లెడ్‌బ్యాంకు మేనేజర్‌గా పని చేస్తున్నాడు. ప్రతి రోజు వికారాబాద్ నుండి లింగంపల్లి రైల్వేస్టేషన్‌కు రైలులో వచ్చి.. అక్కడి నుండి బైక్‌పై సూరారం మల్లారెడ్డి ఆసుపత్రికి చేరుకుంటాడు. ఇందులో భాగంగా శనివారం కూడా ఆసుపత్రికి వస్తుండగా మార్గమధ్యంలోని నిజాంపేట్ నుండి బాచుపల్లికి వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారడంతో బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో మల్లారెడ్డి ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి బంధువులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సీసీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 30 : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీ పరిధి, దూలపల్లిలో 14వ వార్డు దుర్గావెల్ఫేర్ సొసైటీలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ రత్నావత్ గంగయ్యానాయక్ శనివారం సీసీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజుల సహకారంతో మరిన్ని సౌకర్యాలు, వసతులు కల్పించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ప్రతి ఏటా వర్షాలు పడితే ఈ కాలనీల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారని, సీసీరోడ్డు నిర్మాణంతో తమ ఇబ్బందులు తప్పుతాయని కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు.

## సమష్టి కృషితో కొంపల్లిని అభివృద్ధి చేసుకుందాం

కుత్బుల్లాపూర్,సెప్టెంబర్ 30 : సమిష్టి కృషితో ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ..కొంపల్లిని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా ముందుకు రావాలని చైర్మన్ సన్నశ్రీశైలంయాదవ్ పిలుపునిచ్చారు. శనివారం కొంపల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో కౌన్సిల్ సర్వసభ్య సమావేశం కమిషనర్ కె.శ్రీహరి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పలు వార్డుల్లో అభివృద్ధి పనులను చేసేందుకు రూ.8 కోట్ల 27 లక్షల బడ్జెట్‌పై కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ రత్నావత్ గంగయ్యనాయక్, కౌన్సిలర్లు దప్పు కిరణ్‌కుమార్, చింతల రవీందర్‌యాదవ్, చింతల లక్ష్మీదేవేందర్‌యాదవ్, కో-ఆప్షన్ సభ్యులు, ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన సదుపాయాలు

### కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

దుండిగల్, సెప్టెంబర్ 30 : ప్రజలకు మెరుగైన సదుపాయాలను కల్పించే దిశగా కోట్ల రూపాయల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనులు, పెండింగ్ పనులను సకాలంలో పూర్తి చేసేలా సత్వర చర్యలు తీసుకోవాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అధికారులను ఆదేశించారు. శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో తన ప్రగతియాత్రలో భాగంగా పర్యటించి.. 3, 4, 6, 22, 23, 24, 25వ డివిజన్లలో రూ. 7కోట్ల వ్యయంతో సీసీరోడ్లు, కమ్యూనిటీ హాల్స్, మోడ్రన్ దోభీఘాట్‌ల నిర్మాణానికి స్థానిక మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి, కార్పొరేటర్లతో కలిసి ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన సదుపాయాలను కల్పించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని, ఇందులో ఎలాంటి రాజీలేదని, అభివృద్ధి పనులను సకాలంలో నాణ్యతతో పూర్తి చేసేలా సత్వర చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, పార్టీ శ్రేణులు, ఆయా కాలనీవాసులు పాల్గొన్నారు.



నిజాంపేట్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు



బంజారా సేవాలాల్ కమ్యూనిటీహాల్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు



భూమి పూజలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, తదితరులు

## బంజారా సేవాలాల్ కమ్యూనిటీహాల్ నిర్మాణానికి భూమిపూజ

దుండిగల్, సెప్టెంబర్ 30 : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి డబుల్ బెడ్రూం వద్ద నిర్మించనున్న బంజారా సేవాలాల్ కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులకు శనివారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ పార్టీ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు శంభీపూర్‌రాజులు హాజరై భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం అన్ని కుల సంఘాలకు సముచిత స్థానాన్ని కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు, బంజారా సేవాలాల్ కమిటీ సభ్యులు, పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నారు.

## కులవృత్తులకు ప్రభుత్వం పెద్దపీట : ఎమ్మెల్యే

దుండిగల్, సెప్టెంబర్ 30 : కులవృత్తులకు బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. శనివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, 27వ వార్డులో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఆధునిక దోభీఘాట్ నిర్మాణ పనులకు మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్‌లతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రామకృష్ణారావు, కార్పొరేటర్లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## పూజలు.. అన్నదానాలు

దుండిగల్, సెప్టెంబర్ 30 : గణేశ్ ఉత్సవాలను పురస్కరించుకొని ఆయా ప్రాంతాల్లో చివరి రోజు శనివారం గణనాథులకు పూజలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మల్లంపేట్, బౌరంపేట్, సాయినగర్, తదితర ప్రాంతాల్లో జరిగిన పూజల్లో ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు పాల్గొన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 17వ డివిజన్ కౌసల్య కాలనీలో సిద్ధి వినాయక మండపంలో జరిగిన పూజల్లో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి, ఎన్ఎంసీ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, 17వ వార్డు కార్పొరేటర్ ఆగం రాజు, తదితరులు పాల్గొన్నారు.



హరితహారం కార్యక్రమంలో భాగంగా రోటరీ క్లబ్ ఆఫ్ మొయినాబాద్, అజియస్ ఫెడర్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఐడీపీఎల్ చౌరస్తా నుంచి సూరారం కట్టమైసమ్మ వరకు సెంట్రల్ మీడియన్‌లో మొక్కలు నాటారు. ఇందులో భాగంగా చేపట్టిన ర్యాలీలో జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, కూకట్‌పల్లి జోనల్ కమిషన్ మమత, తదితరులు

*- దుండిగల్,సెప్టెంబర్ 30*



కేవీఆర్ వ్యాలీలో కాలనీవాసులతో కలిసి అవగాహన ర్యాలీ తీస్తున్న బీఆర్ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ, తదితరులు



బౌరంపేట్‌లోని ప్రభుత్వ పాఠశాలలో చీపురుపట్టి శ్రమదానం చేస్తున్న స్థానిక కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

## విస్తృతంగా స్వచ్ఛత కార్యక్రమాలు

దుండిగల్, సెప్టెంబర్ 30 : స్వచ్ఛత కోసం ప్రతి ఒక్కరూ సమాజంలో సేవ చేసేందుకు ముందుకు రావాలని పలువురు పిలుపునిచ్చారు. స్వచ్ఛత హై సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం దుండిగల్ మున్సిపాలిటీ వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు చేపట్టారు. దుండిగల్ మున్సిపాలిటీ, మహేశ్వరంలో దుండిగల్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ శంభీపూర్ క్రిష్ణవేణిక్రిష్ణ, 26వ వార్డు కేవీఆర్ వ్యాలీలో బీఆర్ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ, బౌరంపేట్ ప్రభుత్వ పాఠశాలలో ఒక గంట పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, దుండిగల్ తండా-2లో కౌన్సిలర్ శంకర్‌నాయక్‌చౌహాన్ ఆధ్వర్యంలో విస్తృతంగా స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టారు. ఆయా ప్రాంతాల్లో పరిశుభ్రతపై ర్యాలీలు చేపట్టి.. అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కాలనీవాసులు, పార్టీ శ్రేణులు, విద్యార్థులు పాల్గొన్నారు.